క్లుప్తంగా

పంటల వివరాల నమోదు ప్రారంభం



కేటీదొడ్డి: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని కేటీదొడ్డి, నందిన్నె, కొండాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలు, మండల రైతుల వివరాలు ఏఈఓల దగ్గర నమోదు చేయాలన్నారు.

నర్సరీలను సిద్ధం చేయండి

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీని గురువారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో హరితహార మొక్కలను రోడ్ల వెంట మొక్కలు నాటారు. మరికొన్ని చోట్ల మొక్కలు నాటలేదు. వర్షం కురిస్తే ఆయా గ్రామాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవికి ఘన స్వాగతం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీగా గెలుపొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలో నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీకి వెళ్తుండగా ఆయనకు గద్వాల నియోజకవర్గ నాయకులు ఎర్రవల్లి కూడలిలో పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, బండారి భాస్కర్, గంజిపేట శంకర్, కార్యకర్తలు ఉన్నారు.

గట్టు ఎస్‌ఐగా మల్లేష్



గట్టు: గట్టు ఎస్‌ఐగా కేటీ మల్లేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ నారాయణపేటకు బదిలీ అయ్యారు. వనపర్తి జిల్లా నుంచి కేటీ మల్లేష్ గట్టుకు వచ్చారు. నూతన ఎస్‌ఐకి పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ రామకృష్ణకు ఘనంగా వీడ్కోలు పలికారు.

కానిస్టేబుల్‌కు పదోన్నతి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి రావడంతో గురువారం సీఐ రవిబాబు మూడు పట్టీలు అమర్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాల్లో వానాకాలం సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో గురువారం చేలలో పత్తి విత్తనాలు, కందులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒకేసారి వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడింది.

భక్తులకు అన్నదానం



రాజోళి: మండల కేంద్రంలో వైకుంఠ నారాయన స్వామి కల్యాణం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి, అమ్మ వార్ల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన బోయ భీమన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.





మానవపాడులో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అశోక్‌రెడ్డి.. గొందిమల్లలో మాత్రలు వేస్తున్న ఆశ కార్యకర్తలు



గట్టు గురుకుల పాఠశాలలో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యం

- నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఎమ్మెల్యే విజయుడు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో 1–19 సంవత్సరాల విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. మానవపాడు పీహెచ్‌సీ వైద్యురాలు రిజ్వానాబేగం మాట్లాడుతూ విద్యార్థులు మూత్రం, మలవిసర్జన చేసిన వెంటనే చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవన్న, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, మండల కో ఆప్షన్ మెంబర్ చిన్న బాస్ మియ్యా, ఎంపీడీఓ జబ్బార్, ఎంపీఓ పద్మావతి, ప్రధానోపాధ్యాయులు హేమలత, ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలంపూర్: పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపే నులిపురుగులను సమూలంగా నులిపేద్దామని మండల వైద్య అధికారిణి ప్రసూనరాణి అన్నారు. అలంపూర్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని 10,534 మంది విద్యార్థులను గుర్తించి మాత్రల పంపిణీ చేపట్టారు. అందులో 6779 మంది పిల్లలకు మాత్రలు వేయడంతో లక్ష్యం 63 శాతానికి చేరినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారిణి ఇందిర పర్యవేక్షించారు. అల్బెండజోల్ మాత్రలు వేసుకోని విద్యార్థులకు రెండో విడతగా 27న పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారిణి లక్ష్మీకాంత్, డాక్టర్లు ప్రతిభాస్ఫూర్తి, రామస్వామి, సూపర్ వైజర్లు అక్కమ్మ, బాలీశ్వరయ్య శెట్టి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఉండవెల్లి పాఠశాలలో మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. 1నుంచి 2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల పిల్లలకు 1 మాత్రను అందజేశారు. బడికి వెళ్లే పిల్లలకు పాఠశాలలో, బడి బయట పిల్లలకు ఇళ్ల దగ్గర మాత్రలు ఇస్తున్నట్లు వైద్య ఇబ్బంది తెలిపారు.

మల్దకల్: నులిపురుగుల నివారణకు తమ వంతు కృషి చేయాలని డాక్టర్ స్వరూపారాణి ఉపాధ్యాయులు కోరారు. మల్దకల్ హైస్కూల్‌లో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నులిపురుగు నివారణ మాత్రలను ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారందరికి ఇవ్వాలన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన 350 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

మానవపాడు: పిల్లల్లో రక్తహీనతను తగ్గించే లక్ష్యంతో ఎంపీపీ అశోక్‌రెడ్డి, డాక్టర్ సవిత ఆధ్వర్యంలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నులిపురుగు నివారణ వల్ల శరీరక ఎదుగుదల పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు, ఆశలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. చాగదోణ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంఈఓ నర్సింహులు, హెడ్మాస్టర్ రుక్మతుల్లా, హెల్త్ సూపర్ వైజర్ స్వర్ణలత విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. గట్టులోని గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో సీహెచ్ఓ ఉస్సేన్, ఏఎన్ఎం పార్వతి బాలికలకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. గట్టు-3, 5వ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, సుజాతమ్మ, ఏఎన్ఎం పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1–19 ఏళ్ల వయసు గల పిల్లలకు, విద్యార్థులకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు వేశారు.

ధరూరు: మండలంలోని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, సూపర్‌వైజర్ హీర్యా నాయక్, నర్సింహులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 1–19 సంవత్సరాలలోపు పిల్లలకు వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలో మొత్తం 15,496 మంది పిల్లలు ఉండగా, మొదటి రోజు 13,036 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఎంపీహెచ్ఓ శేఖర్ తెలిపారు. ఇటిక్యాల గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రాఘవేందర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు.



అలంపూర్‌లో మాత్రలు వేస్తున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి



ధరూర్‌లో విద్యార్థులు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



మల్దకల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

హరితహారం రంగుల మయం



శాంతినగర్: హరితహారంలో భాగంగా ఆయా గ్రామాల సమీపంలో ప్రధాన రహదారులకు ఇరువైపుల నాటిన చెట్లు రంగుల మయమై కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో లేలేత ఆకులు, పువ్వులతో ప్రకృతిని పరవసింప జేస్తున్నాయి. రహదారిన పోయే వాహనదారులకు ఆహ్లాదాన్ని ఇస్తూ స్వాగతం పలికే విధంగా రోడ్లకు ఇరువైపుల ఎర్రని పూలతో కనువిందు చేస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగిస్తున్నారు. ఎండ ఉన్న సమయంలో చెట్ల కింద సేద తీరుతూ అలసట తీర్చుకుంటున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ధరూరు: గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీఓ కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులుగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ జీవన పరిస్థితి ఇబ్బందిగా మారుతుందని, ప్రతినెల చెల్లించేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని కోరారు.

వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలి

గట్టు: మండలంలోని బల్గెర దళిత వాడలో నూతనంగా వాటర్ ట్యాంకును నిర్మించాలని కొమ్ముల ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, బండారి సునంద్‌లు ఎంపీడీఓ చెన్నయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని దళిత వాడలో తాగు నీటి సమస్య ఉందని తెలిపారు. డ్రైనేజీ లేక మురుగు రోడ్లపై పారుతోందన్నారు. తాగు నీటి సమస్యను తీర్చేందుకు నూతనంగా వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు విన్నవించారు.

విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి

అయిజ: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు మధ్యన పునఃప్రతిష్ఠించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నకు అఖిలపక్ష కమిటీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యలో పెద్ద వాగుపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. దాని వల్ల అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు మధ్యలో నాలుగు రోడ్ల కూడలిలో పునర్ ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల పక్షం కమిటీ నాయకులు ఆంజనేయులు, తిరుమల రెడ్డి, మారెప్ప, నరసింహులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

‘హమాలీల సమస్యలు పరిష్కరించాలి’

అలంపూర్: సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ హమాలీలు సివిల్ సప్లయ్ భవనానికి తరలి వెళ్లారు. అలంపూర్ పట్టణంలోని ఎంఎల్ఎస్ సివిల్ సప్లయ్ పాయింట్ నుంచి సివిల్ సప్లయ్ జీసీసీ హమాలీలు గురువారం తరలి వెళ్లారు. సివిల్ సప్లయ్ జీసీసీ హమాలీలు నూతన రేట్ల ఒప్పందం కోసం ‘చలో హైదరాబాద్ పంజాగుట్టలోని సివిల్ సప్లయ్ భవన్’ కార్యక్రమం నిర్వహించారు. దీంతో తమ డిమాండ్ల సాధన కోసం హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద మద్దిలేటి, ఖాజా బాషా, ఆంజనేయులు, విశ్వనాథం, కన్నయ్య, భూపాల్, సాయిబాబులు తరలి వెళ్లారు.



హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న సివిల్ సప్లయ్ హమాలీలు

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల అవుతున్న ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, డీఈఓ, ఎంఈఓలను నియమించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నరేష్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్

పాఠశాలల్లోనే భవిష్యత్‌కు పునాది

గట్టు: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పాఠశాలల్లోనే పునాదులు పడతాయని, తల్లిదండ్రులు తప్పని సరిగా వారి పిల్లలను పాఠశాలకు పంపాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. గురువారం చాగదోణ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు పుస్తకాలు ఎంఈఓ నర్సింహులుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, అనుభవం కల్గిన ఉపాధ్యాయులతో విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు పాఠశాలల్లోనే పునాది పడుతుందని, బడీడు పిల్లలను తప్పని సరిగా పాఠశాలకే పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు, హెడ్మాస్టర్లు రుక్మతుల్లా, అయ్యస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు సోమేశ్వరమ్మ, లూసమ్మ పాల్గొన్నారు.



చాగదోణలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నేడు యోగా దినోత్సవం విజయవంతం చేద్దాం

అయిజ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని కంపాటి భగత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్ పక్కన వీఆర్ హైస్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని న్యూప్లాట్స్‌లో అండర్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్ దగ్గర మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ వైపున వచ్చే వాహనాలు, కాలనీవాసులు అందులో పడే అవకాశాలున్నాయి. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ను సరిచేయాలని జెడ్పీటీసీ శంషాబాద్ ఇస్మాయిల్, కాలనీవాసులు కోరారు.

శివలింగానికి పుష్పాభిషేకం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలోని శివలింగానికి పుష్పాభిషేకం, బిల్వాభిషేకం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మాస్టర్లు

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం తైక్వాండో తెలంగాణ రాష్ట్ర స్థాయి సర్టిఫికెట్లను మాస్టర్లు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ షేక్షావలి, ఆచారి మాట్లాడారు. మండలం కేంద్రంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన 80 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. తైక్వాండో క్రీడ వల్ల మానసిక, శారీరకంగా బాలబాలికలు ధృడంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో మాస్టర్‌లు షేక్షావలి, మధుకుమార్, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ రమేష్‌లింగం ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి రూ.2500 విలువ చేసే ఉచిత పాఠ్య పుస్తకాలు అదిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులుగౌడు, నర్సింహులు, గోవర్ధనోట్టి, భాగ్యలక్ష్మి, జయరాం, తిమ్మోతి, తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న రమేష్‌లింగం

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



అలంపూర్‌లో శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

అలంపూర్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సామాజిక శిక్షణ తరగతులు జయప్రదం చేద్దామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శిక్షణ తరగతుల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఈ నెల 27, 28వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ భవనంలో జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులం పరిష్కార మార్గాలు, మతం మతోన్మాదం రాజకీయం, అర్థశాస్త్రం, సంఘం నిర్మాణం, పని పద్ధతులు అనే అంశాలపై రెండు రోజులపాటు శిక్షణ తరగతుల్లో బోధించడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులకు జిల్లా నలుమూలల నుంచి కేవీపీఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి అయ్యప్ప, నాయకులు సిద్దయ్య, మద్దిలేటి, గంగన్న ఉన్నారు.

నోట్ పుస్తకాల అందజేత

గద్వాల అర్బన్: విద్య వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని గంజిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యవారధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుబ్బరాజు మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 92మంది విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫరీద, మౌనిక ఉన్నారు.



నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుబ్బరాజు